దగాపడ్డ డాక్టరమ్మ

డాక్టర్ రాజేశ్వరి హాస్పిటల్ డ్యూటీచేసి క్వార్టర్సు చేరుకుని అయిదు నిమిషాలసేపు మంచం మీద అడ్డంగా పడుకుని లేచింది. చాలా అలిసిపోయానను కుంటూ లేచి భోజనం చేసింది. కడుపులో బరువు పడగానే నిద్ర ముంచుకు వచ్చింది. నిద్ర లేచేటప్పటికి మూడు గంటలు కొట్టారు. 'అయ్యయ్యో' అను కుంటూ కప్పు కాఫీ తాగి మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లింది.

ఊపిరాడకుండా వస్తున్నారు పేషెంట్లు. ఉదయమనీలేదు—సాయంత్రమనీ లేదు. గుంపులు గుంపులుగా వస్తున్నారు.

"ఈవేళ టైమయిపోయింది. రేపు రండి" అంటూ ఆయా అందరినీ పంపించేస్తున్నది.

"వీళ్లంతా ఈ ఊరి వాళ్లేనా? లేక పక్క ఊళ్లోనుంచి కూడా వస్తూ ఉంటారా?" ఆయా నడిగింది రాజేశ్వరి.

"చుట్టు పక్కల చిన్న చిన్న గ్రామాలున్నాయి. అక్కడినుంచి కూడా వస్తారు. ఈ ఊరి వాళ్లు కూడా చాలా మంది ఉన్నారు. ఈ వేళ వచ్చిన వాళ్లలో" అన్నది ఆయా.

"అయితే, ఇది పెద్ద ఊరే!" రాజేశ్వరి ఆశ్చర్యపడ్డది.

ఆయా ఏదో చెప్పాలనుకుని రాజేశ్వరి ముఖంలోకి చూసింది.

ఏమిటన్నట్టు చూసింది రాజేశ్వరి.

"ఊరికి వెళ్లిన డాక్టరమ్మగారు పేషెంట్లను చూసి రుసరుసలాడిపోయే వారు. హాస్పిటల్‌కు వచ్చినప్పటినుంచీ ఎప్పుడింటికి వెళతానా అని చూసేవారు.

ఎప్పుడూ గడియారం చూసుకునేవారు. పేషెంట్ల మీద కోపం తెచ్చుకుని అరిచే వారు. అందుకని చాలా మంది ఇంకో ఊరికి వెళ్లేవారు.”

‘అట్లాగా’ అన్నట్లు చూసింది రాజేశ్వరి. క్వార్టర్సు చేరుకుని చల్లగాలికి ఆరుబయట కుర్చీ వేయించుకుని కూర్చుంది.

‘అయితే, ఈ ఊరు మరీ చిన్నది కాదు. బాగా జనాభా ఉన్న ఊరే నన్న మాట’ అనుకుంది. ఏదో పల్లెటూరికి తనను బదిలీ చేశారనగానే తన చీఫ్‌నూ, మిగతా డాక్టర్లనూ సలహా అడిగింది. ఎమ్ బి బి.ఎస్. పూర్తి చెయ్యగానే డి.జి.ఓ చేసింది. ఎమ్.డి. కూడా వెంటనే చేసి డిగ్రీ తీసుకుంది గుంటూరులో. ఆ హాస్పిటల్‌లో అదృష్టంకొద్దీ ఉద్యోగం కూడా దొరికింది. ఇంక తను ఎక్కడికీ వెళ్లక్కర్లేదు అక్కడే స్థిరపడిపోవచ్చనుకుంది. కాని, ఒక సుప్రభాతాన ఒక మన్య ప్రదేశంలోని పల్లెటూరికి బదిలీ చేస్తున్నట్టుగా తాఖీదు వచ్చింది. హాస్పిటల్లో అంతా ఇచ్చిన సలహా ననుసరించి మెడికల్ డైరెక్టర్‌ను కలుసుకుంది. తనను ఉన్న చోటనే ఉంచమని అర్థించింది. తానా పల్లెటూరికి వెళ్లనని మరీ మరీ చెపింది. ఆయన ‘సరే, చూస్తా’నని చెప్పి ఆమె వెళ్లిన మరునాడు మరో పల్లె టూరికి బదిలీచేస్తూ ‘తప్పకుండా వెళ్లి డ్యూటీలో జాయిన్ కావాలి ఒక వారంలోపల’ అంటూ ఆర్డర్స్ పంపాడు.

రాజేశ్వరి కళ్లనీళ్ల పర్యంతం అయింది. కాని, చేయగలిగిందేమీ కనపడ లేదు. ఆత్మబంధువులా తనను కనిపెట్టుకుని ఉన్న గోవిందమ్మతో బయలుదేరి వెళ్లింది.

అక్కడ తనకంటెపెద్ద డాక్టర్ రమణారావు. ఆయనను దర్శించి డ్యూటీలో జాయినయింది. స్టాఫంతా ఒక్కొక్కరే వచ్చి దణ్ణంపెట్టి వెళ్లారు. వచ్చిన వారం రోజులవరకూ పని ఎక్కువనిపించింది. గుంటూరు హాస్పిటల్లో పదిమందిలో తా నొకతెగా పనిచేసింది. ఇక్కడ తనొక్కతే కనక భారమనిపిస్తూంది. పదిహేను రోజులయ్యేసరికి పనికి బాగా అలవాటుపడిపోయింది.

అప్పుడప్పుడు ఆయా రాజేశ్వరి కంటె ముందర ఉన్న డాక్టర్ని గురించి కబుర్లు చెబుతూ ఉండేది. డాక్టర్ సునందకు ఒక కొడుకూ, కూతురూ నట. ఆమె భర్త డాక్టర్ అజీజ్ ఎఫ్ ఆర్.సి.ఎస్. డిగ్రీ కోసం విదేశాలకు వెళ్లాడట. హాస్పి

ఉల్ డ్యూటీమీద ఉన్నప్పుడు కూడా తన పిల్లలను గురించే మాట్లాడేదట. వాళ్లను గురించే ఆలోచిస్తూ ఉండేదట.

ఎంత పిల్లల మీద ప్రేమగల డాక్టరయినా ఉద్యోగమూ, దాని ధర్మమూ సక్రమంగా నిర్వర్తించవద్దూ అనుకుంది రాజేశ్వరి. మగవాళ్లమాదిరిగా ఉద్యోగాలు చేయదలచుకున్నప్పుడు ఆ బాధ్యతలు కూడా వాళ్లలాగే నిర్వర్తించాలి. అన్నిటిలో సమానంగా ఉండాలని రాజేశ్వరి ఉద్దేశం.

ఈ మాట అనుకున్నప్పుడల్లా రాజేశ్వరికి కాలేజీ లెక్చరర్ మిస్ జోషి జ్ఞాపకం వస్తుంది. ఆమె ఉద్యోగానికి దరఖాస్తు పెట్టేటప్పుడు నలుగురు పిల్లల తల్లి అయిన రేవతి కూడా పెట్టింది. అది ప్రైవేటు కాలేజీ. క్రైస్తవ మిషనరీలు నడిపేది. చివరకు సెలెక్షన్ కమిటీ మిస్ జోషిని సెలెక్ట్ చేసింది. వివాహితలూ, పిల్లల తల్లులూ సరిగా ఉద్యోగ ధర్మాలను నిర్వహించరనీ, వాళ్ల ధ్యాసంతా ఎప్పుడూ పిల్లలమీద, ఇంటి మీద ఉంటుందనీ, భర్త ప్రభుత్వోద్యోగి అయితే ఉద్యోగాలు వదిలిపెట్టి వెళ్లిపోతారనీ సెలెక్షన్ కమిటీ అభిప్రాయపడి, క్లాసు రాక పోయినా సరేనని మిస్ జోషినే సెలెక్ట్ చేసుకున్నదట.

రాజేశ్వరి మెడికల్ కాలేజీకి వచ్చేటప్పటికి ఆడపిల్లలు చదువులు ఎంత ముఖ్య మనుకుంటారో కొందరు విద్యార్థినులు ఋజువు చేశారు. ఆమెతో కూడా మల్టీపర్పస్ హైస్కూల్లో చదివి పాసయిన ఆరుగురు విద్యార్థినులు మెడికల్ కాలేజీకి దరఖాస్తు పెట్టి సీట్లు తెచ్చుకున్నారు. కాని. సుందరికి మొదటి సంవత్సరం పరీక్షల ముందర పెళ్లయిపోయింది. భర్తతో జబల్‌పూర్ వెళ్లిపోయింది. కావేరి, మణి, పుష్ప రెండో సంవత్సరం పరీక్ష వ్రాసి పెళ్లిళ్లు చేసుకున్నారు మెడికల్ కోర్సు పూర్తిగా చదివి డాక్టర్లయింది రాజేశ్వరీ, రాధాను. వీళ్లిద్దరూ పాసయిన నాడు ప్రిన్సిపల్ "ఆడపిల్లలు మాకూ హక్కుందంటూ మెడికల్ కాలేజీలో సీట్లు తెచ్చుకుంటారు కాని, చదువు కొనసాగించే వరకూ నమ్మకంలేదు. చదువు పూర్తి చేసుకుని డాక్టర్లయినందుకు మిమ్మల్నిద్దరినీ అభినందిస్తున్నాను" అంటూ ఛలోక్తి విసిరారు.

ఆయన ఆ మాట అంటూంటే కాలేజీ చదువు వదిలిపెట్టిన వాళ్లమీద ఎంతో కోపం వచ్చింది రాజేశ్వరికి. సిగ్గుతో తల వంచుకుంది.

మెడికల్ కోర్సు చదివేటప్పుడు రాజేశ్వరికి కూడా ఎన్నో ఆటంకాలు ఎదురవుతూ ఉండేవి. కాని, అవి గాలికి చెదిరిపోయే మేఘాల మాదిరిగా చెదిరి పోతూ ఉండేవి. తల్లి హేమలతమ్మ పోయేటప్పటికి రాజేశ్వరి మూడో సంవత్సరం చదువుతూంది మొదటినుంచీ రాజేశ్వరి బంగారు పతకాలు బహూమతి పొందిన విద్యార్థిని. ఆమె అంటే ప్రొఫెసర్ల కెంతో సంతోషం, గౌరవం, గర్వం కూడాను. ఒక నాడు ఆమె కాలేజీ నుంచి ఇంటికి వచ్చేసరికి తల్లీ, తండ్రి మాట్లాడు కుంటున్నారు.

"రాజీ కోర్సు పూర్తిచేసేటప్పటికి దానికి ఎన్నేళ్లు వస్తాయి?" తల్లి అడుగుతూంది.

"తప్పకుండా పాసయితే ఇరవై మూడేళ్లు దాటుతాయి. ఆపైన హౌస్ సర్జన్‌గా ఒక ఏడాది. ఇంకా పైన ఎమ్. డి. చెయ్యాలంటే మరో మూడేళ్లు. ఎంత లేదన్నా రెండు మూడు ఏళ్లు తక్కువగా ముప్ఫై వేసుకో" అంటున్నాడు తండ్రి

"అయితే, దానికి పెళ్ళెప్పుడు? మూడు పదులు మీదికి వచ్చినప్పుడా?" తల్లి కంఠంలో ఆందోళన వినిపించింది.

"అన్న మాటే."

"అప్పుడేం పెళ్లి? అప్పుడైనా దానికి ఈడైనవాడూ, జోడయినవాడూ దొరకవద్దూ? సంబంధం దొరకటం చాలా కష్టం కదూ?"

"ఏం చేస్తాం మరి? ఈ దీర్ఘమయిన కోర్సులో చేరిన పిల్లల కింతే" అన్నాడు తండ్రి.

"అందుకే కాబోలు చాలా మంది ఆడ డాక్టర్లకు సరయిన సంబంధాలు దొరక్కపోవటం. పెళ్లికాని వాళ్లు చాలా మంది ఉన్నారు. మన రాజీ అట్లా పెళ్లి కాకుండా ఉండిపోతుందనుకుంటే నాకు చాలా బాధగా ఉంది. ఒక్కగా నొక్క పిల్ల, దాని మీదనే నా ప్రాణాలన్నీ పెట్టుకున్నాను." ఆమె కన్నీరు కార్చింది.

"అంత బెంబేలు పడద్దు. సాధారణంగా డాక్టర్లకు డాక్టర్లే దొరుకుతారు. చదువుకునే రోజుల్లోనే చదువుకునే వాళ్లలో ఎవర్నో ఒకరిని ఎన్నుకోకుండా ఉంటుందా? చదువు పూర్తయిన తరవాత పెళ్లిళ్లు చేసుకుంటారు చాలామంది."

"అయితే, అప్పుడు మనం చేసినట్టుంటుందా? మనం చూసినట్టుంటుందా? కులగోత్రాలు కలవవు. డిగ్రీ ఉంటే చాలనుకోవాలి." అంతేనా అన్నట్లు చూసింది తల్లి.

"మన రాజీవి ఇంత పెద్ద చదువు చదివించినప్పుడు ఆ మాత్రపు సంస్కారానికి ఒప్పుకోవాలి. నీవు కాస్త మనసు మార్చుకోకపోతే ఎలా?" నవ్వుతూనే సమాధాన పెట్టాడు."

వాళ్ల సంభాషణలోని సారాంశ మేమిటో పక్క గదిలో ఉన్న రాజేశ్వరికి అర్థమయింది. అమ్మ ఎప్పుడూ దిగులుగా ఉండటం ఇందుకా అనుకున్నది. తనకు మాత్రం దృష్టంతా చదువుమీదనే ఉన్నది. తనతో ముఖాముఖి పెళ్లి మాట ఎత్తకుండానే హేమలతమ్మ నాలుగు నెలల తరవాత చనిపోయింది. మెడికల్ కోర్సు పూర్తి అయేవరకూ తనను ఏ విషయంలోనూ నిర్బంధించకుండా తల్లి ఉన్నప్పటి కంటె గారాబంగా చూశాడు తండ్రి. కోర్సు పూర్తి కాగానే ఒకనాడు అతి సున్నితంగా పెళ్లి ప్రశంస ఎత్తాడు.

"వైద్య వృత్తికి నా జీవితాన్ని అంకితం చెయ్యాలని నిశ్చయించుకున్నాను, నాన్నా!" అన్నది. ఆ మాట లనేటప్పుడు తన కాలేజీ ప్రిన్సిపల్ అన్న మాటలు మనసులో మెదులుతూనే ఉన్నాయి.

"నీ జీవితం దానికి అంకితం చెయ్యటానికి నేను అభ్యంతరం చెప్పటం లేదమ్మా. నీవు తోడబుట్టిన వాళ్లెవరూ లేని ఒంటరిదానివి. నీకు జీవితంలో ఒక తోడు కావాలి. ఒక డాక్టర్నే ఎన్నుకో. ఇద్దరూ కలిసి పని చేసుకోండి. నేను చనిపోయే లోపల నీవు గృహిణివి కావాలి. అదే నా కోరిక" అన్నాడు. ఆయన కంఠంలోని బరువును చూసి ఆమె అదిరిపోయింది.

"ఇటువంటి మాటలని నా ధైర్యం చెడగొట్టకు, నాన్నా. పెళ్ళి కాకపోతే ఏం? మనిద్దరం హాయిగా ఇలాగే ఉందాం. అనవసరంగా బాధ పడకండి ఈ వయసులో. మంచి సినిమా వచ్చిందట, రండి, చూద్దాం." ఆయన ఆ ప్రశంస ఎత్తినప్పుడల్లా ఏదో ప్రసంగంలోకి లాగి మరిపిస్తూ ఉండేది. హాస్పిటల్ నుంచి రాగానే రోగుల కబుర్లు, పత్రికలు, రాజకీయాలు ఎన్నెన్నో చెప్పి మనసు మళ్లించే ప్రయత్నాలు చేస్తూ ఉండేది.

రాజేశ్వరి ఎమ్. డి. చేస్తూండగా ఆయన కిడ్నీ జబ్బు వల్ల పది రోజులు బాధపడి చనిపోయాడు. ఆ దుఃఖంలో కూడా రాజేశ్వరి మనసంతా పరీక్ష మీద కేంద్రీకరించి పాసయింది.

రాజేశ్వరికి ఏ పని చేసినా ప్రథమ శ్రేణికి చెందేటట్లు చేయాలని కాంక్ష. ఆమెకు ద్వితీయ శ్రేణి నచ్చదు. చదువులోనూ, డాక్టరయిన తరువాత డ్యూటీ చెయ్యటంలోనూ తన పంతం సాగించుకుంటూ వస్తూంది.

రాజేశ్వరి హాస్పిటల్‌కు వచ్చిన నెలకే పెద్ద డాక్టర్ రమణారావు ఈ విషయం గ్రహించాడు. తను కూడా ఆమెను చూసి రోగులతో నిదానంగా మాట్లాడటమూ, ఓపికతో వాళ్లు చెప్పినది వినటమూ ప్రారంభించాడు.

"డాక్టర్, మీరు నాకు పాఠాలు నేర్పుతున్నారు" అనేవాడు నవ్వుతూ.

"నేను నేర్పటం ఏమిటి? డిగ్రీ తీసుకున్నప్పుడే మనం నేర్చుకున్నా" మనేది రాజేశ్వరి నవ్వుతూ.

రాజేశ్వరి అక్కడికి వచ్చిన తరవాత ఆ ఊరి మర్యాదలను కొన్ని పాటించవలసి వస్తూంది. కొందరు ధనికులు ఉన్నారు. వాళ్ల కుటుంబాలు హాస్పిటల్‌కు రావు. ఏ చిన్న జబ్బుకయినా డాక్టర్ని ఇంటికి పిలుస్తారు. కొందరు హోదాతో పిలుస్తారు. కొందరు డబ్బిస్తాము రమ్మంటారు. అది పల్లెటూరు. తను తప్ప మరో ఆడ డాక్టర్ లేదు పిలిచినప్పుడు వెళ్లక తప్పటం లేదు రాజేశ్వరికి. పంచాయితీ సమితి ప్రెసిడెంట్ గారి అమ్మాయి గర్భిణి. ఆమెను చూడటానికి తరుచుగా రాజేశ్వరి అక్కడికి వెళ్లవలసి వస్తూంది.

సాయంకాలం అయిదు గంటల తరవాత ఇంటి ముందర కుర్చీ వేసుకుని పత్రిక తిరగవేస్తున్నది రాజేశ్వరి ఒకనాడు. ఆనాడు ఆదివారం. చాలా తీరిక.

"డాక్టర్ గారు పత్రికలో ముఖం దూరిస్తే అందరినీ మరిచిపోతారు కాబోలు."

తలఎత్తి చూసింది. పంచాయితీ సమితి చైర్మన్‌గారూ, ఆయన వెంట మరొక యువకుడూ ఎదురుగా నిలబడ్డారు.

"ఈవేళ ఆదివారం కదా. అందుకని తీరిగ్గా పేపరు చూస్తున్నా. ఇలా వచ్చి కూర్చోండి." రెండు కుర్చీలు చూపించింది.

'ఈవేళ మీరు రాత్రికి మా ఇంటికి రావాలి. మా సుమన నొప్పులు పడుతున్నది. మీరు పంపిన వర్తు వచ్చింది. కాని—మీరు కూడా రావాలి సుమండి" చైర్మన్ గారు కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ అన్నారు. ఆయన పక్కనే ఆ యువకుడూ కూర్చున్నాడు.

వీళ్ళను చూపి నౌకరు గోవిందమ్మ కాఫీ కప్పులు తీసుకువచ్చింది.

"డాక్టర్‌గారూ, వీరిని నేను పరిచయం చేయకుండానే కాఫీ కప్పు అందు కుంటున్నాను. వీరు ఇంజనీరు రామమోహనరావుగారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కూడా కొంతకాలం పనిచేశారట. నెల రోజులు సెలవు తీసుకుని పల్లెటూరి గాలి మంచిదని ఇక్కడికి వచ్చారు. వారం రోజులయింది." రాజేశ్వరికి ఆయనను పరిచయం చేశారు చైర్మన్‌గారు.

"ఈ డాక్టర్‌గారు ఈ ఊరు వచ్చిన తరవాత ఈ ఊరి వాళ్ళేకాక, చుట్టు పక్కల ఆడవాళ్ళంతా ఈ హాస్పిటల్‌కే వస్తున్నారు." ఎంతో సంతోషంతో ఆమెను ఆ యువకుడికి పరిచయం చేశారాయన.

"అందులో చెప్పుకోదగిన గొప్పతన మేమున్నది! మా వృత్తి అదే కదా!" తృప్తిగా జవాబిచ్చింది రాజేశ్వరి.

"వృత్తి ధర్మాన్ని చక్కగా నెరవేరుస్తున్నారన్న మాట'' అన్నాడు రామమోహనరావు ఆమెను వింతగా చూస్తూ.

ఆమెకు ఇటువంటి ప్రశంసలు కొత్తవి కావు. అటువంటి మాటలు ఆమె చెవివరకూ వెళ్ళనే వెళ్ళవు. మాటలకోసం కాదు కాని....ఎందుకో కళ్ళెత్తి అతడి ముఖంలోకి చూసింది.

అతడికళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి.

ఆ తరవాత ప్రసంగం వాళ్ళ మధ్య చాలా విషయాల మీదికి వెళ్ళింది. కొన్నిటి మీద దీర్ఘ చర్చ జరిగింది. కొన్ని నామమాత్రంగా స్పృశించి వదిలారు.

వాళ్ళు వెళ్ళేటప్పుడు చైర్మన్‌గారు మరొకసారి ఆమెకు ఆ రాత్రి తన కూతురిని చూసి వెళ్ళమని చెప్పారు.

రాజేశ్వరి హుషారుగా లేచి ఎనిమిది గంటలకు భోజనం చేసి గోవిందమ్మను వెంట తీసుకుని చైర్మన్ గారి ఇంటికి వెళ్ళింది. రాత్రి పన్నెండు గంటలకు పురుడు వచ్చింది. మగపిల్లవాడు పుట్టాడు. చైర్మన్‌గారూ, ఆయన భార్యా కూడా చాలా సంతోషపడ్డారు. రాజేశ్వరి ఒక దేవత అయిపోయింది వాళ్ళ దృష్టిలో. చైర్మన్‌గారు స్వయంగా ఆమెను ఇంటివరకూ సాగనంపారు. ఆ దంపతుల దృష్టిలో రాజేశ్వరి ఆ ఇంటి పెద్దాడపడుచు. మంచి కూర, మంచి టిఫిన్-ఏదయినా సరే ముందు పెద్దాడపడుచుకు పంపకుండా వాళ్ళు అనుభవించలేకపోయేవారు.

ఆ ఆదివారం సాయంత్రం వేళ రామమోహనరావు చైర్మన్‌గారి పదేళ్ళ కుమారుడితో కూడా వచ్చాడు.

"నాన్న మీకు చక్రకేళి పళ్ళు ఇమ్మన్నారు" అంటూ డజను అరటిపళ్ళు బల్లమీద పెట్టాడు చైర్మన్‌గారి కొడుకు మురహరి.

"రోజూ ఏదో ఒకటి మీ ఇంటినుంచి రావలసిందేనా?" అంటూ వాళ్ళిద్దరికి చెరొక పండు ఇచ్చి తినమన్నది రాజేశ్వరి.

బెరుకు లేకుండా రాజేశ్వరీ, రామమోహనరావూ మాట్లాడుకున్నారు చాలా సేపు. అతడి సంభాషణ అంతా ఇంగ్లీషులోనే ఉంది. చక్కని ఉచ్చారణ. ఎన్నెన్నో ఇతర దేశాల కబుర్లూ, వింతలూ, విశేషాలూ, సైన్సూ, నాగరికత— అనర్గళంగా మాట్లాడేస్తున్నాడు. వెళ్ళేటప్పుడు మళ్ళీ కలుద్దామని వాగ్దానాలు కూడా చేసుకున్నారు.

అలా మూడు ఆదివారాలు గడిచాయి. క్రమంగా చనువూ, స్నేహమూ పెంపొందటం మొదలయింది. ఆమె హృదయంలో అతడొక గొప్ప మేధావిగా, గొప్ప స్కాలర్‌గా ముద్రపడిపోయాడు

నాలుగో ఆదివారం వచ్చింది. ఆ రోజు సాయంత్రం ఎప్పటి మాదిరిగా రామమోహనరావు వస్తాడని కుర్చీలు వేయించి ఎదురుచూసింది రాజేశ్వరి. 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ', 'ఫిల్మ్‌ఫేర్', 'ఫెమీనా' పత్రికలన్నీ తిరగవేస్తూ కూర్చుంది.

మధ్య మధ్య ఎవరయినా వచ్చారేమోనని గేటువైపు తలఎత్తి చూస్తున్నది. ఎవరూ రాలేదు.

రాజేశ్వరి ఉంటున్న క్వార్టర్సు అందంగా లేకపోయినా చాలా వీలుగా ఉన్నది. పెరటివైపు కూరగాయల మడులు, పొట్ల, బీర, దొండ పాదులకు పందిళ్ళూ ఇంటి ముందర పూలచెట్లూ, గజమున్నర ఎత్తు ప్రహరీ గోడల, చిన్న గేటు లోపల రెండు గదులు, హాలు, వంట ఇల్లు చిన్నవరండా బాత్‌రూమ్-వగైరా ఒక చిన్న కుటుంబం ఉండటాని కెంతో వసతిగా ఉంది. రాజేశ్వరి ఇల్లంతా ఒక సారి కలయతిరిగి వచ్చింది. పెరటి తోటంతా చూసి వాకిలి వైపుకు తిరిగింది. ఏదో అనుకున్న పని కాకపోతే కలిగే చిరాకు ముఖంమీద స్పష్టంగా కనపడు తున్నది.

చివాలున తలుపు తీసి బయటికి వెళ్ళేటప్పుడు వేసుకునే చెప్పులు వేసుకుని హెడ్‌మాస్టరుగా రింటికి వెళ్ళుతున్నానని గోవిందమ్మకు చెప్పి బయలుదేరింది. ఆ ఊళ్ళో విద్యుద్దీపాలు ఉండవనీ, ఊరంతా బురదగా ఉంటుందనీ, సిమెంటు రోడ్లు ఉండవనీ——ఏమిటేమిటో ఊహించుకుని భయపడిపోయింది. రాజేశ్వరి అక్కడికి వచ్చేముందు. కాని, ఆ ఊళ్ళో కూడా విద్యుద్దీపాలు, తారు రోడ్లు, ఒక సినిమా హాలు ఉన్నాయి. పెద్ద వీధి నిండా మేడలూ, సిమెంటుతో కట్టిన అమెరికన్ డిజైను గల ఇళ్లూ ఉన్నాయి. పెద్ద వీధి చౌరస్తా మీద నేలమీద వ్యాపారం నడుస్తూ ఉంటుంది. అక్కడికి వచ్చిన తరవాత రాజేశ్వరి అభిప్రాయాలన్నీ మారి పోయాయి.

రాజేశ్వరికి హెడ్‌మాస్టర్ గారి భార్య ఉమాసుందరమ్మ వాకిట్లోనే ఎదుర యింది. మల్లెపూలు కోసుకుంటూ. రాజేశ్వరిని చూడగానే భుజంమీద చెయ్యేసి లోపలికి తీసుకువెళ్ళి హాల్లో ఉయ్యాల బల్లమీద కూర్చోబెట్టి, తను కూడా పక్కన కూర్చుని——"ఏం కబుర్లు?" అంటూ ముఖంలోకి చూసింది.

"ఏముంది? ఈ మధ్య మీరు మా ఇంటికి రావటం మానేశారు. ఆదివారం వస్తే నాకేమీ తోచదు. అందుకని నేనే వచ్చాను" అన్నది బుంగమూతితో.

"చూశావా, చూశావా ఎంత అబద్ధమో! డాక్టరమ్మకు అబద్ధాలు కూడా ఆడటం వచ్చునన్నమాట!" అన్నది ఉమాసుందరమ్మ కోపాన్ని అభినయిస్తూ.

"అబద్ధమా! చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు!" తెల్లబోయి చూపింది రాజేశ్వరి

ఉమాసుందరమ్మది పెద్ద వయస్సు కనక 'నీవు' అనే సంబోధిస్తుంది రాజేశ్వరిని. చనువుగా మాట్లాడుతుంది ఆమె కొడుకులు ఇద్దరు పై చదువులకవి వగరంలోనే ఉంటున్నారు. రాజేశ్వరి వచ్చినప్పటినుంచీ ఆడపిల్ల లేని కొరత తీరినట్లుగా ఉన్న దామెకు.

"నేను మొన్నటి ఆదివారం మీ ఇంటి గేటు వరకూ వచ్చాను. అప్పుడు డాక్టరమ్మ ఎవరితోనో మాట్లాడుతున్నది. పానకంలో పుడకలాగా నే నెందుకని వెనక్కి తిరిగాను" ఉమాసుందరమ్మ కొంటెగా రాజేశ్వరి ముఖంలోకి చూపింది.

"ఓహో అదా సంగతి! ఆయనెవరో ఇంజినీరట. సెలవు తీసుకుని ఈ ఊరు వచ్చారట. చైర్మన్‌గారు తీసుకువచ్చారు. తరవాత రెండుసార్లు—ఒకసారి ఆయన కొడుకుతోనూ, ఒకసారి ఒంటరిగానూ—వచ్చాడు. ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం." మామూలు ధోరణిలో చెప్పింది రాజేశ్వరి.

"నా మనసులో ఉన్నమాట చెప్పద్దూ మరి! నే నేమనుకున్నానంటే, ఆయన ఎవరో గాని, మా డాక్టరమ్మకు ఈడూజోడూ కలిసినట్టుగా ఉన్నాడు. ఆమె త్వరగా మేలుకుంటే బాగుంటుం దనుకున్నా. ఏదో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా ఉన్నారు. నా కోరిక తీర్చకపోతుందా అని ఆశపడుతూ తిరిగి వెళ్ళిపోయాను."

ఉమాసుందరమ్మగా రింటి చక్కిలాలంటే రాజేశ్వరికి ఎంతో ఇష్టం. వెళ్ళినప్పుడల్లా అడిగి పెట్టించుకుంటుంది. రాజేశ్వరిని చూడగానే లోపలికి వెళ్ళి చక్కిలాల పళ్లెం తీసుకు వచ్చింది ఉమాసుందరమ్మ.

"నాకు మిమ్మల్ని 'అక్కా' అని పిలవాలనుంది. నాకు అక్కలు లేరు గనక ఆ కోరిక అలాగే నిలిచిపోయింది." చక్కిలాలు తుంచి పళ్ళెం నిండా పోసుకుని తినటం మొదలు పెట్టింది.

"పిలు, నేను వద్దన్నానా? అప్పు డేం చేస్తానో తెలుసా? అక్క అనగానే నాకు అధికారం వస్తుంది. ఒక మరిదిగారిని తీసుకువచ్చి మూడు ముళ్లూ వేయిస్తాను." ఏమనుకుంటున్నావో అన్నట్టు చూపింది ఉమాసుందరమ్మ.

రాజేశ్వరి విరగబడి నవ్వింది. ఆ నవ్వు 'మా అమ్మా, నాన్నా ఏం చెయ్యా లేక పోయారుగానీ నీవేం చేస్తా'వన్నట్టుంది.

"నీ నవ్వు నా కర్థమయింది. నే నలా ఊరికే చెప్పేదాన్ని కాదు. నాకు క్రియ కావాలి. ఈ వేళే మా మరిది-అంటే మా వారి తమ్ముడు-ఉత్తరం వ్రాశాడు. ఆయన ఒక కంపెనీకి మేనేజరుగా ఉన్నాడు. ప్రమోషను కూడా వచ్చిందట. ఇన్నాళ్లూ దానికోసమే ఆగాడట. ఇప్పుడు మీరు చెప్పినట్టు వింటాను. పిల్లని చూడమని వ్రాశాడు. ఇదిగో ఫోటో చూడు." చేతి కిచ్చింది.

"నాకు పెళ్ళికావలసినప్పుడు మీ దగ్గరికి వస్తాను." నవ్వుతూ ఫోటో తిరిగి ఇచ్చేసింది రాజేశ్వరి.

"ఒక నెల టైమిస్తా. బాగా ఆలోచించుకో."

ఇద్దరూ కులాసాగా ఎక్కడెక్కడివో కబుర్లు చెప్పుకున్నారు. జీవితంలో తను పోగొట్టుకున్న తల్లితండ్రుల ప్రేమా ఆప్యాయతా, వాత్సల్యమూ రాజేశ్వరికి ఉమాసుందరమ్మ దగ్గర పుష్కలంగా లభిస్తున్నాయి.

ఎనిమిది గంటలవేళ రాజేశ్వరి ఇంటికి వచ్చి భోజనం చెయ్యాలని బల్ల ముందర కూర్చుంది. గోవిందమ్మ భోజన పదార్థాలన్నీ తీసుకువచ్చి బల్లమీద పెట్టింది. అన్నీ వడ్డించుకుని కలుపుకోబోతూ తల ఎత్తి చూసింది. ఏదో అలికిడి అయినట్టుగా తోచి.

బల్లదగ్గరగా నిలబడ్డాడు రామమోహనరావు. దిగ్గున లేచింది రాజేశ్వరి సంభ్రమంతో. "భోజనం చేద్దురుగాని, కూర్చోండి" అన్నది.

కుర్చీ ఒగ్గరకు లాక్కుని కూర్చుంటూ "నా సెలవు అయిపోతున్నది. డ్యూటీలో జాయిన్ కావాలి. అదే ఆలోచిస్తూ ఊరి బయట పొలాలకేసి వెళ్ళి కాలు సాగేవరకూ తిరిగి వస్తున్నా" అన్నాడు.

"అందుకే భోజనంచేసి విశ్రాంతి తీసుకోండి" అన్నది.

"అహఁ వద్దు, వద్దు, ఈ వేళ నేను భోజనం చెయ్యదలుచుకోలేదు."

"ఎందుకని?"

"నన్నో పాడు ఊరికి బదిలీ చేశారు. అక్కడి నీళ్లు నాకసలే పడవు. అక్కడ రాజకీయాలంటేనే నాకు తలనొప్పి."

"అయ్యో, ఆ దిగులుతో భోజనం చెయ్యరా ఏమిటీ?" ఆదుర్దా పడ్డది రాజేశ్వరి.

"ఆ బదిలీ ఆర్డరు చూడగానే ఆకలి చచ్చిపోయింది"

"అయితే, ఒక పని చెయ్యండి. సెలవు పొడిగించండి. ప్రాణం కొన్నాళ్లు పాటు నిశ్చింగా ఉంటుంది. ఏదో కాస్త మీకు ఇష్టమున్నంతవరకూ భోజనం చెయ్యండి. నా కంపెనీ కోసమయినా చెయ్యాలి." గునిసింది రాజేశ్వరి.

ఎట్లాగో అతడిని ఒప్పించి పళ్లెంలో వడ్డించింది. భోజనాలయిన తరవాత ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు.

"వస్తాను మరి" అంటూ అతడు వెళ్లిపోయాడు.

రాజేశ్వరి పక్కమీద పడుకుంది కాని, ఉమాసుందరమ్మ మాటలే చెవిలో మారుమ్రోగటం మొదలుపెట్టాయి. మధ్య మధ్య రామమోహనరావు ముఖం నిండుగా నవ్వుతూ కళ్లకు కట్టినట్టుగా ఉంది. అతడిది ఎంత మెత్తటి హృదయం! ఎంత స్నేహ శీలి! భుజం తట్టి మనసులో జొరబడుతున్నాడు. తియ్యటి మాటలు....గిలిగింతలు పెట్టే కంఠస్వరం. ఇదేమిటి? గది తలుపులు వేసుకున్నా మనసంతా ఆక్రమించుకుని కూర్చున్నాడు! ఆమె మనసంతా అలలతో పొంగులెత్తే మహాసముద్రంలా ఉంది. నిద్రపట్టదు. పట్టినా అది కలతనిద్ర.

ఎప్పుడో ఆమెకు నిద్ర పట్టింది. ప్రొద్దుటే లేచి హాస్పిటల్ డ్యూటీ చేసి వచ్చింది. ఇంటికి వచ్చేటప్పుడే ఛైర్మన్‌గారి అమ్మాయిని చూపి ఒక ఇంజక్షన్ ఇచ్చి వచ్చింది. ఆ మరునాడే ఛైర్మన్‌గారి ఇంట్లో నామకరణ మహోత్సవం. బాలెంత డాక్టరమ్మకు ఒక పట్టు చీరె, బుట్టనిండా పళ్లు ఇచ్చి నమస్కారం చేసింది. ఆ రాత్రికి ఛైర్మన్ గారింట్లో విందు భోజనాలు. రామమోహనరావు వడ్డన. అబ్బ, కొసరి కొసరి వడ్డించ టం! చూపులతోనే తినేయటం రాజేశ్వరి తప్పించుకోలేకపోయింది.

తరవాత రెండు రోజుల వరకూ పని తీరిక లేకపోయింది. హాస్పిటల్ నుంచి ఇంటికి రాగానే అలసినట్లయి పడుకునేది. అలా పడుకున్న సమయాలలో రామమోహనరావు చిలిపి నవ్వులు నవ్వుతూ ఎదురుగా నిలబడినట్లనిపించేది. ఉమా సుందరమ్మ అన్న మాట ఈడు జోడూ చెవులలో గింగురు లెత్తించేది.

ఈడూ జోడుగా కనపడినంత మాత్రాన అలా అనుకోవటమేః ఏం సబబుః

ఒళ్లు జలదరించినట్లవుతూంది. ఆమె అదుపులో పెట్టినా వినిపించుకోకుండా మనసు గంతులు వేస్తున్నది.

సాయంత్రం రాజేశ్వరి హాస్పిటల్ నుంచి వచ్చేసరికి లానులో కూర్చుని ఉన్నాడు రామమోహనరావు. ఆమె చిరునవ్వుతోనే పలకరించి, లోపలికి వెళ్లి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని వచ్చింది. గోవిందమ్మ కాఫీతీసుకువచ్చింది.

మామూలు కుశల ప్రశ్నలు అయిన తరవాత రామమోహనరావు తన కుర్చీ రాజేశ్వరికి దగ్గరగా లాక్కుంటూ "నేను మొన్న అడిగినదానికి సమాధానం కావాలి. నేను ఇక్కడ ఉండటమనేది కూడా మీ సమాధానం మీద ఆధారపడి ఉంది." చేతి రుమాలు వేలికి చుట్టుకుని గిరగిరా తిప్పటం మొదలు పెట్టాడు.

లజ్జాభారంతో దించిన తలపైకి ఎత్తి అతడి కళ్లలోకి చూసింది రాజేశ్వరి.

"ఆ పద్ధతులేం పనికిరావు. నోటితో చెప్పాలి." చూపులతోనే ఆమెను తలక్రిందులు చేస్తున్నాడు. తనకా పారవశ్యం దేనికిః అతడి చూపులకు అంత ప్రభావం ఉన్నదాః ఆమెకు అంతా అగమ్యగోచరంగా ఉంది.

"నన్ను....నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి." తడబడుతున్నది ఆమె నాలుక.

"ఇంకా ఆలోచనాః అంత చిన్న ప్రశ్నకు సమాధానం చెప్పటానికి మూడు రోజుల కంటె ఎక్కువ కావాలాః అయితే, అది కాని మాటే, స్పష్టంగా కనపడుతూనే ఉంది. సరే, మంచిదండీ, డాక్టర్‌గారూ, స్నేహితులుగా విడిపోదాం. సెలవు. వస్తాను మరి"లేచి నిలబడ్డాడు చేతులు జోడించి.

రాజేశ్వరికి ప్రాణాలు ఎవరో లాగేస్తున్నట్లనిపించింది. ధైర్యం తెచ్చు

కుంటూ "మీ రడిగిన ప్రశ్న చిన్నది కాదు. చాలా పెద్దది. జీవిత సమస్య. నా కొకవారం టైమివ్వండి." అర్థించినట్లుగా ముఖం పెట్టింది.

"మంచిది. మీ ఇష్టం వచ్చినన్ని కావివ్వండి. అప్పుడయినా నాకు కావల సింది వట్టి సమాధానం కాదు. గట్టిది కావాలి. ఆఁ వింటున్నారా?" ఖండించి నట్లు మాట్లాడాడు.

"మీరు ఎదుటి వాళ్లను శాసించగలరు. మీరన్నట్టు వినకపోతే శిక్షించగలరు."

అతడొక కొంటె చూపు విసిరాడు ఆమె ముఖం లోకి. ఆమె తబ్బిబ్బయి పోయింది.

ఎనిమిది గంటలకు ఇద్దరూ లేచారు. అతడు గేటు దాటే వరకూ చూసి ఆమె లోపలికి వెళ్లి భోజనం చేసి పడక చేరింది.

ఆ మరునాడు లేదు—మూడవ నాడు రాజేశ్వరి డాక్టర్ రమణరావు ఆఫీసు రూములోకి వెళ్లినప్పుడు ఆయన అన్నారు:

"డాక్టర్ రాజేశ్వరీ! ఈ ఉదయం ఒక కేసు వచ్చింది. ఎపెండిసైటిస్ ఏమోనని అనుమానంగా ఉంది. ఇప్పుడు మందిచ్చాను. నొప్పి తగ్గుతున్నది. ఆ నొప్పే మళ్లీ వచ్చేటట్లయితే రేపు ఆపరేషన్ తప్పదు. నాకు మీరు ఎసిస్టు చేయవలసివస్తుంది. సాయంత్రం డ్యూటీకి వచ్చినప్పుడు ఆ కేసు చూడాలి మీరు. పేషెంటు ఎట్లా ఉన్నదీ నాకు రిపోర్టు పంపాలి."

సరేనని తల ఊపింది. సాయంత్రం డ్యూటీలోకి వస్తూనే ఆ పేషెంటు ఎక్కడ అని వెతుక్కుంటూ వెళ్లింది. మంచం దగ్గరికి వెళ్లి చూసి గతుక్కు మన్నది. భయం, ఆదుర్దా పొగలూ సెగలుగా ఆమెను ఆవరించాయి. నిద్ర పోతుంటే లేపటమెందుకని తన వార్డులో పని చూసుకుని మళ్లీ వచ్చింది. డాక్టర్ని చూడగానే రామమోహనరావు పక్కకు తిరుగుతూ నవ్వాడు.

"మీ రిక్కడికి ఎప్పుడొచ్చారు? నొప్పి ఎప్పటినుండి?" ఆదుర్దాగా అడిగింది రాజేశ్వరి.

ఆమె ముఖం వంకే చూస్తూ చెప్పాడు:

"ఇప్పుడు ఎట్లా ఉంది? పగలు నిద్ర పట్టిందా?"

"మందుతోటి నిద్రపట్టింది. నిద్రలోనే నొప్పికూడా తగ్గుతోంది."

డాక్టర్‌గా ఆమె అతడిని పరీక్ష చేసింది. వార్డు బాయ్ చేత మందు తెప్పించి ఇచ్చింది.

"డాక్టర్, నన్ను మందులతో నిద్రపుచ్చకండి. ఆ నొప్పేదో బాగా రానీయండి. ఆపరేషన్ చేసెయ్యండి. బల్లమీదనే చచ్చిపోతాను."

"ఆప్లానంతా మా కొదిలిపెట్టాలి. మీరు నిశ్చింతగా ఉండి మే మేది ఇస్తే అది తీసుకోవాలి. మా చేతుల్లోకి వచ్చిన తరవాత మా ఇష్టమే" అంది తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో.

"ఎందుకు? నాకు బ్రతుకుమీద తీపి చచ్చిపోయింది. బ్రతికినా చచ్చినట్టే లెక్క." ముఖంమీద నైరాశ్యం పులుముకుంటూ కనుబొమలు చిట్లించాడు.

డాక్టర్‌గా ఆమె అతడికి ధైర్యం చెప్పటానికి ఎన్నెన్నో కబుర్లు చెప్పటం మొదలుపెట్టింది, మంచం దగ్గరగా స్టూలు లాక్కుని. ఆమె ప్రయత్నమంతా అతడికి బ్రతుకులో నైరాశ్యం పోగొట్టాలని. పొద్దుపోయేవరకూ కూర్చుని అతడికి కావలసినవన్నీ తెప్పించి ఇస్తూ కబుర్లతో అతడికి ఉత్సాహం కల్పించటానికి ప్రయత్నించింది.

ఆ మరునాడూ, తరువాత రెండు రోజులూ అతడికి ఆపరేషన్ చేయతగినంత నొప్పి రాలేదు. కాని, డాక్టరు అతడిని హాస్పిటల్‌లోనే ఉంచాడు.

రాజేశ్వరి ఇంటికి వచ్చి భోజనం చేసి పగలంతా హాస్పిటల్‌లోనే ఉండేది. అతడికి ఏదోరకంగా కాలక్షేపం కలిగించేది. అతడు చిన్నపిల్లవాడిలా మందు తీసుకోవటానికీ, పాలు తాగటానికీ మారాము చేసేవాడు. ఆమె పిల్లలను మాటలతో మరిపించినట్టు మరిపించి బ్రతిమిలాడేది.

అయిదు రోజులు హాస్పిటల్‌లో ఉన్న తరవాత డాక్టర్ రమణారావు రామమోహనరావును ఇంటికి వెళ్లవచ్చన్నాడు. ఎప్పుడయినా నొప్పి వస్తే తీసుకోవలసిన మందులు రాసి ఇచ్చాడు.

రాజేశ్వరి చూడటానికి వచ్చేటప్పటికి రామమోహనరావు మంచం మీద కూర్చున్నాడు.

"తల దువ్వుకున్నారు. ఇస్త్రీ బట్టలు వేసుకున్నారు. చాలా హుషారుగా ఉన్నట్టున్నారు ఏమిటి సంగతి?" నవ్వుతూ మంచం దగ్గరగా నిలబడ్డది,

"డాక్టరుగారు ఇంటికి వెళ్ళచ్చు అన్నారు. మీకోసమే ఎదురుచూస్తున్నాను. మీరు రాగానే చెప్పి వెళ్ళిపోదామని" అన్నాడు.

"డాక్టరుగారు ఇంటికి వెళ్ళమంటే సంతోషంగా ఉంటారు పేషెంట్లు. మీరిలా చిన్నబుచ్చుకుని కూర్చున్నారేం?" పెద్ద పెద్ద పూల నైలాను చీరె కట్టుకుని, దాని మీద తెల్ల కోటు వేసుకుంది. కోటు జేబుల్లో చేతులు పెట్టుకుంటూ ఇటూ, అటూ చూస్తున్నది.

"నామటుకు నాకు ఇక్కడ ఉంటేనే సంతోషంగా ఉంది. ఇంటికి వెళ్లటమంటే ఏడుపుగాక ఇంకేముంటుంది?" ఆమె వైపు వింతగా చూశాడు.

రాజేశ్వరి అదేమీ పట్టించుకోనట్టుగా కాసేపు నిలబడి "మంచిదండి. నమస్కారం. వస్తాను" అని రోగుల మంచాలమధ్యగా నడుస్తూవెళ్ళిపోయింది, ఇంక ఒక్క నిమిషం ఎక్కువ నిలబడితే అతడి మాటలు శ్రుతి మించుతాయని.

మూడు నాలుగు రోజుల వరకూ రాజేశ్వరికి సాయంత్రం వేళ విజిటర్సు ఎవరూ లేరు. ఆమె ఒక రోజు ఉమాసుందరమ్మను చూసి ఒక గంటకాలం గడిపి వచ్చింది.

కుటుంబ నియంత్రణకు సంబంధించిన నాలుగు ఆపరేషన్లుచేసి, రెండు కష్టమయిన కాన్పులుచేసి ఇంటికి వచ్చింది రాజేశ్వరి. ఆ నాడు శనివారం. ఆనాడు వెంకటేశ్వర స్వామిని తలుచుకుంటూ గడపటం చిన్నప్పటినుంచీ అలవాటు. డాక్టరయిన తరవాత తీరుబడిలేక సాయంత్రంవేళ ఒక అయిదు నిమిషాలు స్వామి స్తోత్రాలు మననం చేసుకుంటుంది ఆమె స్తోత్రం పఠించి, పత్రిక చూసుకుని ఇక లోపలికి వెళ్ళాలనుకుని లేవబోతుండగా రామమోహనరావు వచ్చాడు,

"ఎలా ఉంది మీ ఒంట్లో?" అంటూ కూర్చోవడానికి కుర్చీ చూపించింది.

"హాస్పిటల్‌లో ఉన్నన్నాళ్లూ బాగా చూశారు, జీవితం మీద ఆశలు కల్పించారు కోరికలు రేకెత్తించారు. కొండమీద నుంచి ఒక్కసారి తోసినట్టుగా ఇంటికి తోలేశారు. ఇంక ఆ పేషెంట్లు ఎట్లా ఉంటే మీకేం?" మందహాసం చేశాడు.

"డాక్టర్లు హాస్పిటల్లో బాగా చూస్తారు ఇంటికి రమ్మని పిలిస్తే కూడా వస్తారు. ఇందులో మా తప్పేమిటో చూపించండి" నవ్వుతూ సమాధానమిచ్చింది.

"అలాగా!" దీర్ఘం తీసి ఆమె ముఖంలోకి చూస్తూ. "నా విజ్ఞప్తి ఏమయింది?" అన్నాడు, ఆచూపులో ఆమెను పరవశింప జేయాలన్న భావం స్పష్టంగా కనపడేటట్లుగా ముఖం పెట్టి.

"నేను వారమన్నాను కదా. అందులో అయిదు రోజులు నేను ఆ విషయాన్ని గురించి ఆలోచించనే లేదు. ఆ అయిదు రోజులూ పగలంతా మీ సమక్షంలోనే ఉన్నాను కదా. రాత్రిళ్ళు అలిసిపోయినట్లయి నిద్రపోయేదాన్ని." చేతివేళ్ళను సవరించుకుంటూ అన్నది.

"అయితే, మరెప్పుడు నాకు జవాబు?"

"రేపు."

"అంటే, గోడమీద రాసిపెట్టిన రేపు వంటిది కాదుకదా?"

"అబ్బెబ్బె. నిజంగా రేపు నా జవాబు విందురు గాని."

'ఓ కే' అంటూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. రామమోహనరావు, వెనక్కి తిరిగి చూస్తూ.

రామమోహనరావుతో అతడు హాస్పిటల్లో ఉన్న అయిదు రోజులూ పెళ్ళి విషయం ఆలోచించలేదన్నది కాని, నిజానికి ఆమెకు ఆ అయిదు రోజులూ నిద్ర పట్టలేదు. ఆమె మనసుకు వెన్నెలలేదు, వెలుగులేదు. చిమ్మ చీకట్లు ఆవరించుకున్నట్లు బాధపడ్డది. అతడు తేరుకుని నవ్వుముఖం పెట్టినప్పుడు ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది. మనసెంతో తేలిక అయింది. తీగెలు సాగే తీయటి భావాలతో ఆ రాత్రి హాయిగా నిద్రపోయింది.

మరునాడు సాయంత్రం అయిదు గంటల తరవాత రామమోహన్‌రావు వస్తాడని మంచి టిఫిన్ చేయించింది. చిక్కటి కాఫీ తయారు చేయించింది. లాన్‌లో కుర్చీలు వేయించుకుని పత్రికలు చేత పట్టుకుని కూర్చుంది.

ఆరు ఏడు గంటలయే సరికి ఆమెకు ఒక విధమయిన అనుమానం కలిగింది. తను అన్న 'రేపు' మీద అతడికి నమ్మకం కలగలేదేమో? అయినా, రేపు అని ఎందుకనాలి తను? మనసులో ఉన్న మాట చెప్పలేకపోయిందా? తనెంత తెలివితక్కువది?

అవును, చెప్పలేకపోయింది. మనసు నిండా ఆవరించుకుపోయిన తియ్యటి భావాలే తనను నోరు మెదపనివ్వలేదు. వాటితోనే తను ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. కళ్ళనిండా అతడిని చూడలేకపోయింది. అది తన బలహీనతా? ఏమో మరి?

ఈవేళ నిన్నటి వలె కాదు. నవ్వుతూ అతడికి సమాధానమిచ్చి సంతోష పెట్టాలి. తనలో ఉన్న జంకుమ తోసిపుచ్చాలి. తనకే నవ్వు వస్తూంది. ఇంత చదువూ చదివి, ఇన్నాళ్ళనుంచీ ఉద్యోగం చేస్తూ ఆ జంకేమిటి తనకు? తను పిరికిదా? కాదు కాని, ఏమిటో మరి!

"ఏదో దీర్ఘాలోచనలో ఉన్నారే డాక్టర్‌గారు? నేను వచ్చి అయిదు నిమిషాలయినా ముఖమెత్తి చూడలేదు." కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

రెండు నిమిషాల మౌనం ఇద్దరి మధ్యా సంచరించింది.

"మీరు ఈవేళ కూర్చోమని కుర్చీ కూడా చూపించరని నాకు నేనే ఆహ్వానించుకుని కూర్చున్నాను." నవ్వాడు.

ఆమె ఒకసారి అతడి కళ్ళలోకి చూసి నవ్వింది. ఆ నవ్వుతో అతడికి కొంచెం ధైర్యం వచ్చింది. కొంతసేపు ఏదో కబుర్లలోకి దింపాడు ఆమెను. తను హాకీ, క్రికెట్ ఆటగాడట. ఇతర ఊళ్ళకు కూడా వెళ్ళి మాచెస్ గెలిచివస్తూ ఉండేవాడట. తనకు ఇంజనీరింగ్ కాలేజీలో సీటు మంచి ఆటగాడనే ఇచ్చారట. ఉద్యోగభారంవల్ల ఆటలన్నీ అడుగున పడిపోతున్నాయట. అలా చెప్పుకుంటూ పోతున్నాడు.

"ఆఁ డాక్టర్‌గారూ! నన్ను సెలవు తీసుకోమన్నారా?" గాంభీర్యాన్ని నటిస్తూ, నవ్వును అణిచిపెట్టుకుంటూ అడిగాడు.

ఉలిక్కిపడ్డది రాజేశ్వరి ఆ మాటతో.

"ఉండండి, అప్పుడే వెళతారా? మీ కోసం స్పెషల్‌గా చేయించిన కాఫీ టిఫిన్ తీసుకుని వెళ్లుదురుగాని. లోపలికి వెళదాం, రండి." లోపలికి తీసుకు వెళ్లింది.

డైనింగ్ టేబుల్ మీద సర్వమూ సిద్ధం చేయబడి ఉన్నాయి. సమోసాలు, బాసందీ, పెరుగు వడ—ప్లేట్లో అన్నీ సర్ది అతడి ముందు పెట్టింది.

"తీసుకోండి." అతడు కూర్చున్న తరవాత తను కూడా కూర్చుని ప్లేటు ముందుకు లాక్కుంది.

"అబ్బబ్బ! ఇన్ని డిషెస్! ఇవన్నీ నా కోసమే! ఇవన్నీ పెట్టి సాగనంపుతారు కాబోలు. ఎల్లకాలం ఇదంతా జ్ఞాపకముంచుకోమ్మనా? డాక్టర్‌గారు ఎట్లాగయినా గట్టివారే?"

రాజేశ్వరి రాత్రినుంచీ తను చెప్పదలుచుకున్న మాటలు మననం చేసుకుంటున్నది. జంకు పోగొట్టుకుని ధైర్యం తెచ్చుకుంటున్నది. కాని, అతడినీ, అతడి మాటలనూ చూడగానే మళ్లీ అరికాళ్లు చెమటపడుతున్నాయి. నోట్లో నుంచి మాట పైకి రావడంలేదు.

అతడు ఆమె మనసులోని భావాలను ఒక కంట కనిపెడుతూ ఉపాహారాలన్నీ పూర్తి చేశాడు.

కప్పులో కాఫీ నింపి రాజేశ్వరి అతడి ముందు పెట్టింది.

"తీసుకోండి. ఆలోచిస్తున్నారేం? చల్లగా ఉందేమిటి? వేడిది తెప్పించమంటారా?" అడిగింది రాజేశ్వరి.

"ఈ వేడి చాలు. ఈ కాఫీ కూడా తాగేసిన తరవాత ఇక వెళ్లవలసిందే గదా? అందుకని నిదానంగా ఒక్కొక్క చుక్క తాగుదా మనుకుంటున్నాను."

ఆమె ఆ మాటకు నవ్వింది ఫక్కున. తాను తాగుతున్న కాఫీ కొంత చీరె మీద ఒలికింది. అతడిని క్రీగంట చూస్తూ తువాలుతో తుడుచుకుంది. అతడు తననే చూస్తున్నాడని గ్రహించి తల వంచుకుంది.

"ఆ. నేను వద్దనుకుంటూనే గటగట కాఫీ తాగేశాను." అతడొక కొంటె చూపు విసిరాడు ఆమె మీదికి.

ఆమె చలించిపోయింది. "అబ్బబ్బ! అలా చూడకండి నా వైపు. నేను భరించలేను " మాట పైకి పెగల్లేదు. ఆమె తన్మయత్వంలో మెలికలు తిరిగి పోయింది.

"చెప్పండి, నాకు ఆలస్యమయిపోతున్నది." గుసగుసలాడినట్టు ఆమె చెవి దగ్గరగా ఊదాడు.

"మీకు వచ్చే జవాబే గట్టి జవాబు. ఇప్పుడు తృప్తి అయిందా?" ఒకసారి ముఖమెత్తి అతడి కళ్ళల్లోకి చూసింది.

అతడు ఎగిరి గంతు వేశాడు. "థాంక్యూ, థాంక్యూ, ఇంత తియ్యటి సమాధానానికి నేనేం బహుమతి ఇవ్వాలి?" దగ్గరగా వచ్చాడు, రెండు చేతులూ చాపుతూ.

ఆమె వెనక్కు అడుగువేసి అతడి చెయ్యి అందుకుని ఊపింది. వ్యక్తపరచ లేని ఆనందంతో ఇద్దరూ లానులో ఉన్న కుర్చీల దగ్గరికి వచ్చారు రాత్రి ఎనిమిది గంటల వరకూ ఇద్దరి మధ్యా ఎన్నో కబుర్లు దొర్లిపోయాయి. చివరకు అతడు మరో రెండు నెలలు సెలవు పెట్టటానికీ, రాజేశ్వరి నాలుగు రోజులు సెలవు పెట్టటానికీ నిశ్చయం చేసుకున్నారు. ఆ మరునాడు తిరుపతి కొండమీద వేంక టేశ్వరస్వామి సాక్షిగా మంత్రయుక్తంగా వివాహం చేసుకోవటానికి రాజేశ్వరి అతడిని ఒప్పించింది.

"ఒక చిన్న సలహా. పెళ్లి కాగానే ఇక్కడికే వచ్చేయాలి. హనీమూన్ అనీ, అదనీ ఇదనీ అటూ. ఇటూ వెళ్లటం నాకు నచ్చదు" అన్నాడు. బుంగ మూతి పెట్టిన చిన్న పిల్లవాడిలా.

అతడలా మాతి పెట్టి గునుస్తూంటే ఆమె కెంతో ముచ్చటయింది. "అలాగే నాకు మాత్రం అనవసరంగా సెలవు పెట్టడం ఇష్టమా?" అన్నది మురిపెంగా

ఆ రాత్రికి అతడు అక్కడే భోజనం చేశాడు. రేపటి రోజును గురించి ఎన్నెన్నో పథకాలు వేశారు. ఉబికి ఉబికి పైకి వస్తున్న భావాల నెన్నిటినో మనసు లోనే అణచుకుని అయిష్టంతో అతడికి వీడ్కోలిచ్చిం దామె.

తిరుపతి కొండమీద ఇద్దరికి శాస్త్రయుక్తంగా వివాహం జరిగిపోయింది. స్వామి దర్శనం చేసుకున్నారు. కానుకలు చెల్లించుకున్నారు. తీపి పదార్థాలతో భోజనంచేసి తిరుగు ప్రయాణమయ్యారు.

రాజేశ్వరి పెళ్లి నిశ్చయమైనప్పటి నుంచీ తల్లి తండ్రులను తలుచుకుంటూనే ఉంది. తన ఎన్నిక చూసి వాళ్లెంత సంతోషపడేవాళ్లో? ఆలస్యంగా పెళ్లిళ్లు చేసు కునే వారికి అన్నీ కలిసిరావని తల్లి అన్న దొకసారి. తండ్రి చనిపోయే ముందర తన కిష్టమయితే చదువు తక్కువగా ఉన్నా సరే చేసుకోమన్నాడు. అలా కాకుండా చదువూ. సంస్కారమూ, నాగరికతా, వాటికి తగ్గట్టుగా అందమూ, హోదా కలవాడు దొరికాడా లేదా? వాళ్లే ఇప్పుడు బ్రతికి ఉంటే తన నెంత మెచ్చుకునే వాళ్లో? వాళ్లు ఉంటే సంతోషించే వాళ్లు కదా అన్న తృప్తే ఇప్పుడు తనకు మిగిలింది.

తిరిగి రాగానే పెద్ద డాక్టరన్నాడు—"ఎవరికీ తెలియకుండా పెళ్లి చేసుకుంటే సరిపోయిందనుకున్నారా? మాకు పార్టీ కావాలి" అంటూ.

ఇంటికి వచ్చి రామమోహనరావును——"పార్టీ అంటున్నారు డాక్టర్. ఇద్దామా?" అని అడిగింది.

"ఈ ఆడంబరాలు ఏమిటీ?" ముఖం తిప్పుకున్నాడు.

"అందరూ సంతోషంతో అడుగుతున్నప్పుడు మనం వాళ్లను చిన్న బుచ్చ కూడదు." బ్రతిమిలాడి ఒప్పించింది.

పార్టీకి హాస్పిటల్ స్టాఫంతా వచ్చింది. ఛైర్మన్‌గారితో పాటు ఒకరిద్దరు ఊరి పెద్దలు వచ్చారు.

డాక్టర్ రాజేశ్వర్, రామమోహనరావుల జంటను చూసి అందరూ ముచ్చట పడ్డారు. సుఖ సంతోషాలతో దీర్ఘ వైవాహిక జీవితాన్ని అంతా ఆకాంక్షించారు. ఆ మరునాడు ప్రత్యేకంగా ఉమాసుందరమ్మను ఆహ్వానించింది రాజేశ్వరి. ఆమె రాజేశ్వరికి కొత్త చీరె కట్టబెట్టి దణ్ణం పెట్టించుకున్నది.

డాక్టరుగా రాజేశ్వరి హాస్పిటల్ డ్యూటీ ఎప్పటి మాదిరిగా చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నది. అప్పుడప్పుడు అతడు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడే అన్న తలంపు వచ్చి బాధిస్తూ ఉంటుంది. మధుర స్మృతులేవో ముసురుకుంటూఉంటాయి. వెంటనే ఉలికిపాటుతో ప్రస్తుత కర్తవ్యనిర్వహణకు పూనుకుంటుంది.

ఆమె కొక నూతన జవమూ, జీవమూ కలిగినట్లనిపిస్తోంది.

డ్యూటీ నుంచి ఇంటికి రాగానే నవ్వుతూ. తుళ్లుతూ భోజనాలు ముగిస్తారు. ఒక గంట మధ్య విశ్రాంతి. తరవాత ఒక కప్పు వేడి వేడి టీ తాగి వెళ్లలేక వెళ్లలేక హాస్పిటల్‌కు వెళ్లి ఇంటికి వస్తుంది. కొత్త జంట లానులో కూర్చుని కబుర్లాడుకుంటారు.

"మిమ్మల్ని చూసినప్పటి నుంచీ నేనో మాట అడగాలనుకుంటున్నాను. మీ కేమయినా మొక్కా? పెళ్లయినతరవాతనయినా మొక్కు చెల్లించుకోకూడదా?"

"మొక్కేమిటి?" అడిగా డతను అర్థంకాక.

"అదే—అదే—ఆ గడ్డం మాట! చూస్తే అన్యమతస్థుడనిపించేటట్టు." నవ్వింది.

"ఓ అదా?" పగలబడి నవ్వాడతడు. "గడ్డానికీ, మతానికీ ఈ రోజుల్లో సంబంధంలేదు. ఇది ఈ నాటి ఫాషన్. నీ కేమయినా అభ్యంతరమా? 'చెప్పు'" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

తలవంచుకుంటూ "నాకే మభ్యంతరం?" అన్నది.

అతడు గర్వంగా గడ్డం సవరించుకుంటూ నవ్వాడు.

"సరే....అది పోనీయండి. మనం ఫోటో తీయించుకోవాలి తిరుపతిలో వీలయింది కాదు. ఈ వేళ మా హాస్పిటల్‌కు ఒక మంచి ఫోటోగ్రాఫర్ వచ్చాడు. రేపు మనింటికి రమ్మన్నాను" అన్నది సంబరపడుతూ.

హేళనగా నవ్వాడు. "ఫొటో ఎందుకు? ఎదురుగా మొద్దంత మనిషిని నే నుండగా?"

"అదొక సరదా. మన ఇద్దరి ఫోటోలు ఫ్రేములో పెట్టి బల్లమీద పెట్టుకోవాలి. ఇది నా కోరిక. ఇదయినా మీరు మన్నించకూడదా?" గునిసింది.

"పోనీలే, నీ సరదా నే నెందుకు పాడుచెయ్యాలి. నీ మాట కాదని విన్నెందుకు చిన్నబుచ్చాలి", ఒప్పుకున్నాడు.

ఫోటో తయారయిన తరవాత ఫ్రేములో బిగించి ఆమె తన బల్ల మీద పెట్టటమూ. ఆమె లేనప్పుడు అతడు దానిని తీసి పుస్తకాల చాటున పెట్టటమూ రోజూ జరుగుతూంది

"అయ్యో. మన ఫోటో! మన ఫోటో!" అంటూ రాజేశ్వరి హాస్పిటల్ నుంచి వచ్చిన తరవాత ఆదుర్దాతో వెతికి బయటికి తీసి కొంగుతో తుడిచి,ఒకసారి కళ్లారా చూసుకుని బల్లమీద పెట్టుకుంటుంది.

అతడు మనసులో నవ్వుకుంటాడు.

"అబ్బ, మీలో ఎంత చిలిపితనం ఉంది?" అంటుంది అప్పుడప్పుడు రాజేశ్వరి.

"నే నో మాట చెప్పనా? పెళ్లయేవరకూ భర్తకు భార్య మీద మోజూ, ప్రేమా నట. పెళ్లయిన తరవాత భార్యకు భర్త మీద మోజు, ప్రేమా నట! ఎంత నిజం చెప్పండి?" అన్నది గడియారమున్న అతడి చేతిని ఆడిస్తూ.

"నేనూ ఓ మాట చెప్పనా? ఈ కవులకూ, రచయితలకూ జీవితాలు సరిగా సాగక అక్షరాలతోనూ, సూక్తులతోనూ సంతోషిద్దామని ఏమిటేమిటో అంటారు. వాటిని పట్టుకుని తమ నిజ జీవితాలు అట్లా లేవని నీవంటి వాళ్లు బాధ పడతారు." ప్రొఫెసర్ పోజు పెట్టాడు.

"అసలు మీ కెవరిమీదనయినా గౌరవమూ, భక్తీ ఉన్నాయా?" నవ్వుతుంది రాజేశ్వరి.

సమాధానంగా అతడొక చిలిపి నవ్వు నవ్వుతాడు.

"అన్నట్టు, మీ సెలవు అయిపోతున్నట్టుంది." బరువుగా నిట్టూర్చింది.

"ఇప్పుడా జ్ఞాపకం చెయ్యటం? మన పెళ్ళయి నాలుగు నెలలయింది. రెండు నెలల సెలవుకాగానే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను. మనచైర్మన్‌గారిని సంప్రతించి గవర్నమెంటు కాంట్రాక్టులు సంపాదిస్తున్నాను." తన ఘనకార్యాన్ని గురించి గర్వంగా చెప్పాడు.

"అయితే. ఇంత మంచి కబురు నాకు చెప్పకుండా దాచారు కదూ? సెల వయిందంటూ ఎక్కడ ప్రయాణ మవుతారోనని ఏ రోజు కారోజు హడిలిపోతున్నాను." నిష్ఠూరమాడింది.

"ప్రతి విషయానికీ సమయమూ సందర్భమూ రావాలి, రాజీ! నేను పెట్ట వలసింది పోయి నీవు తెచ్చి పెడుతుంటే తినటానికి నే నెంత బాధపడుతున్నానో గమనించావా?" ఆమె కొంగు పట్టుకొని లాగుతూ, "ముందే చెబితే అందులో విశేషం ఏముంటుంది?" అన్నాడు.

ఆమె మనసులో సంతోషం గంతులు వేసింది. గుండె పల్టీలు కొట్టింది.

"మరి మీ సామాను? ఆ ఊరి నుంచి తెచ్చుకోవద్దూ? అద్దెకున్న ఇల్లు ఖాళీచేసి ఆ సామానేదో తీసుకురండి." ఇల్లాలుగా బాధ్యతలు గుర్తు చేసింది. రాజేశ్వరి.

"మొన్నటివరకూ బ్రహ్మచారిగాణ్ణి. నాకేం సామానుంటుంది? అక్కడి నుంచి వచ్చేటప్పుడే నాకు ఉన్న కాంప్ కాట్, ఒక స్టౌ నౌకరు కిచ్చేసి ఇల్లు ఖాళీ చేశాను. సరేనా? అప్పుడు ఇల్లాలుంటే ఇంపెడు సామానుండేది, కాని. లేదుగా?" నవ్వాడు.

ఆ నాడు హాస్పిటల్‌లో రాజేశ్వరికి పని ఎక్కువగా ఉంది. రెండుసార్లు కాఫీ తెప్పించుకుని తాగింది. ఏమిటో ఈ మధ్య నీరసంగా ఉంటూంది. కళ్లు తిరిగి నట్లవుతున్నది. ఇంటికి వెళ్లి ఫాన్ వేసుకుని మంచం మీద ఎప్పుడుపడుకుందామా అనిపిస్తూంది. కాని, డ్యూటీ అంటే డ్యూటీయే. ఈ వేళ అంతా ఇట్లాగే ఉంటే ఓ పది రోజులు సెలవు పెట్టాలి. రామమోహనరావు ఎందుకని అడుగుతాడేమో?

అడిగిన వెంటనే కాకుండా కాస్త ఊరించి, పస్పెన్సులో పెట్టి, నాలుగుసార్లు 'ప్లీజ్, చెప్పవూ?' అని అడిగించుకుని మరీ చెప్పాలి శుభవార్త.

ఆఫీసు గదిలో కుర్చీ మీద కూర్చుని బల్లమీద తల వాల్చి ఆయాకోసం గంట కొట్టింది. అయిదు నిమిషాల సేపు ఆగి మళ్లీ గంట కొట్టింది. కాని, ఆయా రాలేదు.

విసుగుతో కనుబొమలు ముడుచుకున్నది. తొందరగా ఇంటికి వెళ్లాలి. కప్పు కాఫీ మరొకటి తెప్పించుకుని తాగకపోతే ఇక్కడినుంచి అక్కడికి కూడా నడవలేదు.

మరొకసారి గంట కొట్టింది. ఆయాకోసం దర్వాజా వైపే చూస్తున్నది. వరాండాలో బూట్ల చప్పుడు వినిపించింది. ఆతృతగా తల ఎత్తి కిటికీగుండా చూసింది. ఇద్దరు పోలీసు ఆఫీసర్లు చేతికర్ర లూపుకుంటూ లోపలికి వస్తున్నారు.

వాళ్లను చూడగానే రాజేశ్వరికి మరింత నీరసం వచ్చింది. ఏదో పోలీసు కేసు ఉంది. కాబోలు వీళ్లడిగే ప్రశ్నలన్నింటికి జవాబు లిచ్చేటప్పటికి తలప్రాణం తోకకు వస్తుంది. ఎంత ఆలస్యం చేస్తారో? తన ప్రాణం అప్పటివరకు ఉంటుందా?

కూర్చోమని రెండు కుర్చీలు చూపించింది మర్యాదగా. సంగతేమిటో వాళ్లే బయట పెట్టాలని ఎదురుచూస్తున్నది.

"డాక్టర్! మమ్మల్ని క్షమించాలి. మేము పోలీసువాళ్లం. మే మెప్పుడూ అందరినీ బాధించటానికే వస్తాం. మా ఉద్యోగాలే అటువంటివి" అన్నాడొక ఆఫీసరు క్షమాపణ నర్థిస్తూ.

"ఉద్యోగ ధర్మం మరి. మేమూ అంతే. అందరినీ సూదులతో గుచ్చు తాము. చేదుమందు లిస్తాము. కత్తిపెట్టి కోస్తాము. మేమయినా, మీరయినా— అందరి మంచికోసమే కదా చేసేది?" వాళ్లు వచ్చిన పనేమిటో త్వరగా చెప్ప మన్నట్లు చూసింది.

"సారీ, డాక్టర్! మేము ఒక అపరాధికోసం రెండేళ్ల నుంచీ తిరుగు తున్నాం. అతడు ఒకచోట ఒక అమ్మాయిని పెళ్లి చేసుకుని నెలరోజుల తరువాత

ఆమె నగలన్నీ తీసుకుని పారిపోయాడు. ఇంకొకచోట ఒక ప్రైవేస్టును పెళ్లి చేసుకుని ఆరు నెలలు కాపరంచేసి, ఆమె దాచుకున్న వెయ్యి రూపాయలు తీసుకుని పరారీ అయ్యాడు. ఒక పల్లెటూళ్లో సర్పంచ్ ఇంట్లో అతిథిగా ఉండి, చాలా మర్యాదగా మెలుగుతూ పదిహేను వందల రూపాయలతో రాత్రికి రాత్రి పారిపోయాడు. ఏడాది క్రిందట నాగార్జున సాగర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజనీరు ఇంట్లో ఏడువేల రూపాయలు....పిల్ల పెళ్లికి కట్న మివ్వాలని....దాచుకున్నారట. ఆయన భార్యను మంచానికి కట్టేసి సొమ్ము తీసుకుని పారిపోయాడు. అతడు ఇప్పుడీ ఊళ్లో ఉన్నాడని తెలిసి పట్టుకోవటానికి వచ్చాం" అన్నాడు.

"దొంగ ఒక మనిషే కదండీ....ఈ రోజుల్లో ప్రతి మనిషీ టెరిలీన్‌బట్టలు వేసుకుంటున్నారు. అందులో దొంగలెవరో, పెద్ద మనుషు లెవరో ఎలా తెలుసు కోవటం?'' అన్నది. ఆయన చెప్పిన కథ ఎంత పెద్దదో అనుకుంటూ.

''ఆఁ అదే నేను చెప్పవచ్చింది కూడా. చూడండి అతడి ఫోటో." జేబులో నుంచి తీసి ఆమె చేతి కిచ్చాడు.

పోలీసు ఆఫీసరు ఆ ఫోటో తీసుకుని కలంతో గడ్డమూ, సైడ్ లాక్స్ దిద్ది, "ఇప్పుడు గుర్తు పడతారా?" అంటూ ఆమె ముందుకు నెట్టాడు ఫోటోను.

దాన్ని చూస్తూనే కెవ్వున కేకపెట్టబోయి పెదవుల మీద చెయ్యి పెట్టి నొక్కుకుంది.

"సారీ, డాక్టర్! మా బాధ్యతేమిటో ముందే చెప్పాముగా. అతడిని మీ ఇంట్లో ఉండగా బంధించాం. నమస్తే" అంటూ లేచి రెండడుగులు వేసి. అంతలోనే వెనక్కు తిరిగి...."మీరు అతడితో ఏమయినా మాట్లాడాలంటే మాట్లాడవచ్చు. గేటు దగ్గర పోలీసు కస్టడీలో ఉన్నాడు'' అన్నాడు.

కళ్లు మూసుకుని తల అడ్డంగా తిప్పింది. వాళ్లిద్దరూ వెళ్లిపోతున్నట్టుగా బూట్ల శబ్దము వినబడుతున్నది.

రాజేశ్వరికి భూమి గిర్రున తిరుగుతున్నట్టుగా ఉంది. గుండె గబగబ కొట్టు కుంటున్నది. తనెంత మోసపోయింది? ఇంతకాలమూ పెళ్లి చేసుకోకుండా ఉండి

ఉండి ఎటువంటి వాడి సాహచర్యాన్ని అనుభవించింది? ఎన్నో చోట్ల స్త్రీలశీలాన్ని, ధనాన్ని అపహరించిన తుచ్ఛుడా అతడు?

కళ్లు గట్టిగా మూసుకుంది. కన్నీరు జలాజలా చెంపల మీదుగా రాలింది.

బాగ్ తెరచి దానిలో భద్రపరుచుకున్న రామమోహనరావు ఫోటో చేతిలోకి తీసుకుంది. నవ్వులొలికిస్తూ చిలిపిగా చూసే కళ్లు ఆమెను కవ్విస్తున్నాయి. ఆ కళ్లే అతడు పరిచయమైనప్పటి నుండి రాత్రింబవళ్లు ఆమెను వెంటాడాయి. ఆ కళ్లే ఆమెలోని స్త్రీత్వాన్ని మేలుకొలిపాయి. ఆ కళ్లే ఆమె హృదయ కవాటాన్ని తెరిపించాయి. ఆ కళ్లే ఆమెలో నవ చైతన్యాన్ని నింపాయి. అవే ఆమెను వివాహానికి ఒప్పించాయి.

''రామ్, నీ వపరాధివా? కాదు....నా జీవన సహచరుడివి కదూ? పోలీసులు పొరబడుతున్నారని చెప్పు, రామ్. నన్నొక్కదాన్ని వదిలిపెట్టి వెళ్లిపోతావా వాళ్లతో?'' ఆమె గుండె ఎగిసెగిసి పడుతున్నది. ఫోటోను పెదవుల కానించు కుంటూ బరువుగా నిట్టూర్చింది.

''రామ్ నీ వెక్కడికి వెళతావు? ఎక్కడికి వెళ్లగలవు? నీవు నా బందీవి. నా మనసులోనుంచి పోలేవు.''

ఆదుర్దా ఆమెను కూర్చోనివ్వటంలేదు. నిలబడనివ్వటంలేదు. తనకిప్పుడు మూడవ నెల. రామ్ ప్రతిరూపం తన కడుపులో పెరుగుతూంది. తన బిడ్డ....తన ప్రియతముడయిన రామ్ ప్రతి రూపం....అపరాధి బిడ్డ అని అనిపించుకుంటుందా? కాదు, కాదు. పొరపాటు ఎక్కడో జరిగింది. బిడ్డ మాత్రం తన ప్రాణాధికుడ యిన రామ్ బిడ్డ. హృదయం ఘోష పెడుతున్నది

చటుక్కున లేచి వెంటనే కుర్చీలో చతికిలబడిపోయింది. తనింక ఆ ఊళ్లో తల ఎత్తుకు తిరగగలదా? ఆ ఊరివాళ్లకు తన ముఖం చూపించగలదా? పలుగురూ నాలుగు మాటలు మాట్లాడితే తాను భరించగలదా?

దీర్ఘంగా ఆలోచించి పెద్ద డాక్టర్‌కి ఉత్తరం రాసి బల్లమీదే పెట్టింది. తనకొక నెల రోజులు సెలవు కావాలంటూ. సామాను సర్దుకుని గుంటూరు వెళ్లమని గోవిందమ్మకు కబురు పంపించింది. తను గబగబా నడిచి బస్సు స్టాండుకు వెళ్లింది. రెండు బస్సులు మారితేగాని, తను తిరుపతి చేరలేదు.

కొండమీదికి వెళ్లి, 'స్వామీ! నీ సమక్షంలో నీవు సాక్షిగా జరిగిన పెళ్లి పవిత్రమయిందనుకుంటే మోసపుచ్చుతావా?' అని అడగాలని డాక్టర్ రాజేశ్వరి ఆత్రపడిపోయింది.

దారి పొడుగునా రామమోహనరావు నవ్వు ముఖం. చిలిపికళ్లు ఆమెను వెంటాడుతూనే ఉన్నాయి.

'రామ్! నిన్ను మరిచిపోలేను. నీ కొరకు ఎంతకాలమయినా నిరీక్షిస్తాను.' రామమోహనరావు ఫోటో ఉన్న బాగ్‌ను గుండెకు బలంగా హత్తుకుంది.

ఆమె వెంకటేశ్వరస్వామితో తన గోడు అంతా వెళ్లబోసుకుంది. తన కర్తవ్యమేమిటో చెప్పమని ప్రతిరోజూ స్వామిని దర్శించుకుంటున్నది.

ఒకనాటి ఉదయం స్వామి తన నాదేశించినట్టుగా విదేశాలకు వెళ్లటానికి ఏర్పాట్లుకుగాను తిరపతినుంచి బయలుదేరింది డాక్టర్ రాజేశ్వరి.

(ఆంధ్రప్రభ)